## ఆరంభ లాభాలు ఆవిరి

ముంబై, ఫిబ్రవరి 27: దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల మధ్య ట్రేడవుతున్నాయి. విదేశీ నిధుల తరలింపు కొనసాగుతుండటం, నెలవారీ డెరివేటివ్ ముగియడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలు చివర్లో ఒత్తిడిగి గురయ్యాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 10.31 పాయింట్లు పెరిగి 74,612.43 వద్ద ముగిసింది. 74,520.78 పాయింట్ల నుంచి 74,834.08 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సూచీ చివరకు స్వల్ప లాభాలకు పరిమితమైంది. మరో సూచీ నిఫ్టీ 2.50 పాయింట్లు కోల్పోయి 22,545.05 వద్ద ముగిసింది. వరుసగా ఏడో రోజు సూచీ నష్టపోవడం విశేషం. ఆర్థిక సేవలు, మెటల్ షేర్లు లాభపడినప్పటికీ..క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, జొమాటో, టాటా స్టీల్, నెస్లె షేర్లు లాభపడ్డాయి. మరోవైపు, అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 5 శాతం వరకు నష్టపోయింది. కేబుల్, వైర్ల విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు సంస్థ ప్రకటించడంతో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. దీంతో అమ్మకాల బటన్‌నొక్కడంతో ఈ షేరు టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కొటక్ మహీంద్రా బ్యాంక్, టెక్ మహీంద్రా, ఎస్బీలు షేర్లు నష్టపోయాయి.

### ఫానాటిక్స్‌లో 250 ఉద్యోగాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27: అమెరికాకు చెందిన డిజిటల్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ ఫానాటిక్స్..హైదరాబాద్ సెంటర్‌ను విస్తరించబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 250 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వచ్చే రెండేండ్లలో ఈ సంఖ్యను 500కి పెంచుబోతున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ అభిశేక్ చెప్పారు. ఇందుకోసం హైదరాబాద్‌లో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు.

### రెండింతలైన ప్రైవేట్ వినిమయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశీయంగా ప్రైవేట్ వినిమయం రెండింతలైంది. 2013లో ట్రిలియన్ డాలర్ల మేర వినిమయం జరగగా..2024 నాటికి ఇది రెండు రెట్లు పెరిగి 2.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిటైలర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి డెలాయిట్ ఇండియా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రతి యేటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసుకుంటున్నది. అమెరికా, చైనా, జర్మనీ దేశాల కంటే అధిక వృద్ధి ఇక్కడే నమోదుకావడం విశేషం. వచ్చే ఏడాది నాటికి మూడో అతిపెద్ద వినిమయ మార్కెట్‌గా భారత్ అవతరించనున్నదని పేర్కొంది.


# భారత్‌పై టారిఫ్‌ల కత్తి!

## కేంద్రానికి ప్రతీకార సుంకాల భయం

## ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గుతున్న మోదీ సర్కారు

### కార్లు, రసాయన దిగుమతులపై టారిఫ్‌ల కోతకు యోచన






న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలొగ్గినట్టే కనిపిస్తున్నది. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలను వేస్తున్న దేశాలకు ప్రతీకార సుంకాలు తప్పవని అగ్రరాజ్య అధ్యక్షుడు ఈమధ్య కాలంలో పదేపదే చెప్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌కూ సుంకాల పోటు ఉంటుందని ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధాని మోదీకి ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న వివిధ రకాల దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించేందుకున్న అవకాశాలను అన్వేషిస్తున్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్తున్నాయి.

#### ఇదీ సంగతి..

కార్లు, మోటర్‌సైకిళ్లు తదితర ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, కీలక ఔషధాలు, కొన్ని వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, విస్కీసహా మరికొన్నింటిపై వసూలు చేస్తున్న సుంకాలను తగ్గించే వీలుందంటున్నారు. తద్వారా అమెరికా అధిక సుంకాల నుంచి తప్పించుకోవచ్చన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం.. అమెరికా సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పటికే నిర్దేశించుకున్న సుంకాల కోత కంటే ఇంకా ఎక్కువగానే టారిఫ్‌లను తగ్గించాల్సి రావచ్చన్న అంచనాలను వారు వెలిబుచ్చుతుండటం గమనార్హం. దీంతో చాలారకాల వస్తు, సేవల దిగుమతులపై పెద్ద ఎత్తునే సుంకాలు తగ్గవచ్చని చెప్తున్నారు.

#### అమెరికాతో మైత్రి

ప్రస్తుతం అమెరికా సుంకాల హెచ్చరికలు.. యావత్తు ప్రపంచ వాణిజ్యాన్నే వణికిస్తున్నాయి. ఇప్పటికే స్టాక్, కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై ఆ ప్రభావం కనిపిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయా దేశాలతోపాటు భారత్ సైతం అమెరికాతో స్నేహపూర్వక వాతావరణానికి ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కాలుదువ్వుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు చొరవ చూపాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. నిజానికి గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు చెక్ పెట్టాలంటే భారత్‌ను ప్రోత్సహించడమే మార్గమని అమెరికా సైతం భావిస్తున్నది. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది. మరోవైపు భారత్‌కు రక్షణపరమైన ఎగుమతుల్ని పెంచాలని అమెరికా చూస్తున్నది. అయితే ఇప్పుడు రష్యా నుంచే ఎక్కువగా ఇక్కడికి వస్తున్నాయి. ఫలితంగా రష్యాతో సంబంధాలు చెడకుండా ట్రంప్ మెప్పును పొందే పనిలో మోదీ సర్కారున్నట్టు చెప్తున్నారు. ఇక 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరాలని అటు అమెరికా, ఇటు భారత్ లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2023లో ఇది 127 బిలియన్ డాలర్లే.

#### మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లు?

పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లను మంగళవారం నుంచి విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం. అలాగే చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం యూనివర్సల్ టారిఫ్‌ను రెట్టింపు చేయాలని కూడా చూస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, అమెరికాలోకి ఎంతమాత్రం ఉపేక్షించని విధంగా మనుషుల అక్రమ రవాణా, ఔషధాల స్మగ్లింగ్ జరుగుతున్నదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు అధిక సుంకాలు ఒక్కటే మార్గమని ట్రంప్ అనుకుంటున్నారు.



## దిగొచ్చిన పుత్తడి

### రూ.1,150 తగ్గిన తులం ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: రికార్డుస్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర గురువారం ఒకేరోజు రూ.1,150 తగ్గి రూ.88,200కి దిగొచ్చినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతేస్థాయిలో తగ్గి రూ.87,800కి దిగొచ్చింది. బంగారంతోపాటు వెండి ధరలు కూడా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.98,500కి దిగింది. అంతకుముందు ఇది రూ.99,500గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.440 తగ్గి రూ.87,380కి తగ్గగా, 22 క్యారెట్ ధర కూడా రూ.400 దిగొచ్చి రూ.80,100గా నమోదైంది. కిలో వెండి రూ.1.06 లక్షలుగా ఉన్నది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌లో పదిగ్రాముల బంగారం ధర రూ.85 వేలకు తగ్గింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,892.95 డాలర్లకు పడిపోగా, వెండి 32,47 డాలర్ల వద్ద ఉన్నది.

## ఇక గేమింగ్ కొత్త పుంతలు

### దేశీయ తొలి పీసీ, పబ్లిషింగ్ హౌజ్‌ను ప్రారంభించిన 1312 ఇంటరాక్టివ్

హైదరాబాద్, ఫిబ్రవరి 27: గేమింగ్ కంపెనీ 1312 ఇంటరాక్టివ్.. దేశీయంగా తొలి పీసీ, కన్సోల్ గేమ్ పబ్లిషింగ్ హౌజ్‌ను ప్రారంభించింది. గేమింగ్ ఎక్స్‌పర్ట్స్ దీపక్ గురిజాల, రవితేజ మంతెన స్థాపించిన ఈ సంస్థ.. అంతర్జాతీయ ఆడియన్స్ కోసం ప్రపంచ శ్రేణి ఇండీ, ఏఏ గేమ్స్‌ను కనిపెట్టి, పబ్లిష్ చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు గురువారం ప్రకటించింది. కాగా, తమ ప్రీ-సీడ్ ఫండింగ్ రౌండ్‌ను విజయవంతంగా పూర్తిచేశామని ఈ సందర్భంగా వ్యవస్థాపకులు తెలిపారు. ఇక ఈ ఏడాదికిగాను మార్కెట్‌లోకి తేవాలనుకున్న గేమ్స్‌ను ఇప్పటికే ఆవిష్కరించామని కూడా చెప్పారు. ఈ క్రమంలోనే ఏటా 6-8 గేమ్స్‌ను మార్కెట్‌కు పరిచయం చేయాలని నిర్ణయించుకున్నట్టు వారు వివరించారు. ఇందులోభాగంగానే దేశవ్యాప్తంగా గేమ్ స్టూడియోలు, మార్కెట్, పబ్లిషింగ్ బలోపేతంపై దృష్టి పెడుతున్నారు. 'మా లక్ష్యం భారతీయ గేమ్స్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే. ఆగ్నేయాసియా దేశాల్లోని గేమ్ డెవలపర్లతో కలిసి అవకాశాలను అన్వేషిస్తున్నాం' అని తమ కొత్త వెంచర్ గురించి మాట్లాడుతూ దీపక్, రవితేజ తెలియజేశారు. కాగా, ఇండివీడ్యువల్స్ డెవలప్ చేసే వీడియో గేమ్‌లే ఇండీ గేమ్స్. ప్రొఫెషనల్స్ అభివృద్ధిపర్చే గేమ్‌లే ఏఏ గేమ్స్. ఇటీవలికాలంలో వీటికి మార్కెట్‌లో భారీగా డిమాండ్ కనిపిస్తున్నది. దీంతో కొత్త టెక్నాలజీతో రకరకాల వీడియో గేమ్స్ వస్తున్నాయి.

# విమాన ప్రయాణికులు హైజంప్

### జనవరిలో దేశీయంగా 1.46 కోట్ల మంది ప్రయాణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశీయ విమానప్రయాణికులు అంతకంతకు పెరుగుతున్నారు. జనవరి నెలలో దేశీయంగా 1.46 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని డీజీసీఏ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన 1.31 కోట్లతో పోలిస్తే 11.28 శాతం అధికమయ్యారని తెలిపింది. సంస్థల వారీగా 65.2 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో తొలి స్థానంలో నిలిచింది. ఎయిర్ ఇండియా గ్రూపు మార్కెట్ వాటా 25.7 శాతానికి తగ్గింది. అలాగే ఆకాశా ఎయిర్, స్పైస్‌జెట్‌ల మార్కెట్ వాటా వరుసగా 4.7 శాతం, 3.2 శాతానికి పెరిగాయి. గత నెలలో విమానాల రద్దు 1.62 శాతంగా ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఫ్లైబిగ్ వాటా 17.74 శాతంగా ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో ఫ్లై 91(5.09 శాతం) అలయెన్స్ ఎయిర్(4.35 శాతం) ఉన్నాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. సరైన సమయానికి విమాన సర్వీసులు నడిపిన సంస్థల్లో 75.5 శాతంతో ఇండిగో తొలిస్థానంలో నిలువగా..ఆకాశ ఎయిర్ 71.5 శాతం, ఎయిర్ ఇండియా 69.8 శాతం, అలయెన్స్ ఎయిర్ 57.6 శాతం, స్పైస్‌జెట్ 54.8 శాతంతో ఉన్నాయి. గత నెలలో విమానాలు రద్దు కావడంతో 41 వేల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీరికి విమానయాన సంస్థలు రూ.46.46 లక్షలు పరిహారం రూపంలో చెల్లించాయి.



#### హైదరాబాద్ టూ దర్భంగా మధ్య ఫ్లైట్

ఆకాశ ఎయిర్ మరో ప్రాంతీయ రూట్‌లో నూతన విమాన సర్వీసును ప్రారంభించడానికి సిద్ధమవుతున్నది. ఏప్రిల్ 4 నుంచి హైదరాబాద్ నుంచి బీహార్‌లోని దర్భంగా(వయా ఢిల్లీ) మధ్య సర్వీసును అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించింది. ఈ రెండు నగరాల మధ్య రోజువారి విమాన సర్వీసును నడుపుతున్నట్లు తెలిపింది.




### మార్కెట్లోకి డిప్లోస్ మ్యాక్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 27: న్యూమెరస్.. మార్కెట్లోకి మరో ఈ-స్కూటర్ 'డిప్లోస్ మ్యాక్స్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ స్కూటర్ ధర రూ.1,12,199గా నిర్ణయించింది. 3.7 కిలోవాట్ల రెండు బ్యాటరీలతో తయారైన ఈ స్కూటర్ పూర్తిగా రీచార్జితో 140 కిలోమీటర్లు, అలాగే గంటకు 63 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సౌందరరాజన్ ఈ సందర్భంగా తెలిపారు.

## హెచ్‌సీఎల్ టెక్ నూతన క్యాంపస్ షురూ

హైదరాబాద్, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ):ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్..హైదరాబాద్‌లో తన గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించింది. నగరంలో సంస్థ ఏర్పాటు చేసిన ఐదో సెంటర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ఈ సంస్థ 60 దేశాల్లో 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులను కలిగివున్నదన్నారు. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో ప్రపంచ స్థాయి సేవలను ఇక్కడి నుంచే అందిస్తున్నాయన్నారు. గ్లోబల్ కంపెనీల అడ్డగా హైదరాబాద్ మారిపోయిందని, ఇప్పటికే పలు సంస్థలు ఇక్కడ తమ రెండో కార్యాలయాన్ని తెరిచాయని చెప్పారు. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందని, తద్వారా అంతర్జాతీయ క్లయింట్లకు సేవలు అందించడానికి వీలుపడనున్నట్లు హెచ్‌సీఎల్ టెక్నాలజీ సీఈవో, ఎండీ విజయకుమార్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

## నేటి నుంచి నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 : వరంగల్ నిట్ ప్రతిష్టాత్మక సాంస్కృతిక ఉత్సవం 'స్ప్రింగ్ స్ప్రీ-2025' వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు కల్చరల్ ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. గురువారం నిట్‌లో ఆయన మాట్లాడుతూ 1978లో ఆవిర్భవించిన స్ప్రింగ్ స్ప్రీ దక్షిణ భారతదేశంలో అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిందని, వినోదం, మేధోపరమైన స్ఫూర్తిని కలిగించే కార్యక్రమాలు, అద్భుతమైన ప్రో షోల కలయికతో జీవితాంతం గుర్తుండిపోయేలా విద్యార్థులకు అనుభూతి అందిస్తుందన్నారు. దేశంలోని అన్ని నిట్‌ల నుంచి విద్యార్థులు ఇందులో పాల్గొంటారని తెలిపారు. కళ, సాహిత్యం, నాటకం, నృత్యం, సంగీతం, క్విజ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, ఫ్యాషన్ షోలు, రాక్ మ్యూజిక్ పోటీలు, మోడల్ యునైటెడ్ నేషన్స్, మినిట్‌మేడ్ వంటి విభిన్న రంగాల్లో ఆసక్తికరమైన కార్యక్రమాలు విద్యార్థులు ప్రదర్శించనున్నారు.

**ప్రో షోలు..**

స్ప్రింగ్‌స్ప్రీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంశాల్లో ఒకటి ప్రో షోలు. ఇందులో ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇస్తారు. 28న గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్, సినీ నటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించనున్నారు. మార్చి 1న భారతీయ రాక్ బ్యాండ్ 'వార్టెక్స్' వారు ఫ్యూజన్ మ్యూజిక్‌తో ప్రేక్షకులను అలరించనున్నారు. రెండు సినిమా బృందాలు విద్యార్థులతో ముఖాముఖి చర్చలో పాల్గొంటాయి. మార్చి 2న ప్రముఖ గాయకుడు అమిత్ త్రివేది సందడి చేయనున్నారు.

### ఎడ్ల పందేల నిర్వాహకులపై కేసు

*'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్*

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 27 : పర్మిషన్ లేకుండా ఎడ్లబండ్ల పందేలు నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన 'ఎలాంటి అనుమతులు లేకుండా ఎడ్ల పందేలు' కథనానికి పోలీసులు స్పందించారు. ఇందులో పాల్గొన్న వారిని గుర్తించి అరెస్టు చేశారు. వివిధ మండలాలకు చెందిన 12 మంది కలిసి ఎడ్లబండ్ల పందేలు నిర్వహించి ఆటోను ఢీకొట్టి డ్యామేజ్ చేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రూ. 24వేలు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### బల్దియా ఇంజినీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

వరంగల్, ఫిబ్రవరి 27: బల్దియా ఇంజినీరింగ్ విభాగంలో ఇంజినీర్ల అంతర్గత బదిలీలు జరిగాయి. కొత్తగా ఏఈలు వచ్చిన తర్వాత వారికి డివిజన్లు కేటాయించి అంతర్గత బదిలీలు చేయాల్సింది పోయి ఇప్పుడు చేయడంపై ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలోనే అంతర్గత బదిలీలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఒక్కో ఏఈకి 6 నుంచి 8 డివిజన్ల వరకు కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి. కాశీబుగ్గ సర్కిల్ ఈఈగా శ్రీనివాస్, డీఈలుగా రంగారావుతో పాటు అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో ఏఈ ముజామిల్‌కు డీఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఏఈలుగా విజయలక్ష్మి, కృష్ణమూర్తి, హబీబుద్దీన్, ముజామిల్‌కు బాధ్యతలు అప్పగించారు. నక్కల గుట్ట సర్కిల్- 2కు ఈఈ సంతోష్ బాబు, డీఈలుగా సారంగం, రాజకుమార్, ఏఈలుగా మేనక, శ్రీకాంత్, హరికుమార్, శ్రీకాంత్‌ను బదిలీ చేశారు. నక్కలగుట్ట సర్కిల్-3 ఈఈగా రవికుమార్, డీఈ గా రవికిరణ్, ఏఈలుగా సతీశ్‌కుమార్, రమణను బదిలీ చేశారు.క్వాలిటీ కంట్రోల్ ఆఫీస్ (బాలసముద్రం) ఇన్‌చార్జిగా ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, నక్కలగుట్ట ఎలక్ట్రికల్ ఆఫీస్ ఇన్‌చార్జిగా ఈఈ మాధవి, వెహికిల్ షెడ్ ఇన్‌చార్జిగా ఈఈ మహేందర్‌కు బాధ్యతలు అప్పగించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌ను కేయూ ఫిల్టర్ బెడ్ నుంచి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌కు బదిలీ చేశారు.

# వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్త హత్యకు భార్య ప్లాన్
- ఏఆర్ కానిస్టేబుల్‌కు సుపారి
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వైద్యుడి హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు
- వెంటిలేటర్‌పై వైద్యుడు సుమంత్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

కరీమాబాద్, ఫిబ్రవరి 27 : వివాహేతర సంబంధం కోసం ఓ భార్య బరితెగించింది. తమకు అడ్డు తగులుతున్నాడని భర్తను హత్య చేసేందుకు ప్రియుడితో కలిసి ప్లాన్ చేసింది. ఇందుకోసం ఏఆర్ కానిస్టేబుల్‌కు సుపారీ ఇచ్చింది. ఈ నెల 20న వరంగల్ నగరంలోని భట్టుపల్లి రోడ్డులో డాక్టర్ సుమంత్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ వెల్లడించారు. 2016లో డాక్టర్ సుమంత్‌రెడ్డి, ఫ్లోరా మరియా ప్రేమ వివాహం చేసుకున్నారు. 2018లో వారిద్దరు సంగారెడ్డికి షిఫ్ట్ కాగా, అక్కడి పీహెచ్‌సీలో సుమంత్‌రెడ్డి కాంట్రాక్ట్ పద్ధతిలో మెడికల్ ఆఫీసర్‌గా, తమ బంధువుల విద్యాలయంలో ఫ్లోరా మరియా టీచర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో ఫ్లోరా మరియా బరువు తగ్గేందుకు ఓ జిమ్ సెంటర్‌కు వెళ్లేది. అక్కడ కోచ్‌గా ఉన్న ఎర్రోళ్ల శామ్యూల్‌తో స్నేహం పెరిగి అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం సుమంత్‌రెడ్డికి తెలియడంతో భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత వారు వరంగల్‌కు షిఫ్ట్ అయ్యారు. 2019లో ఫ్లోరా మరియా ప్రభుత్వ లెక్చరర్‌గా ఉద్యోగం పొంది జనగామ జిల్లా పెంబర్తిలో ఉద్యోగం చేసేది. అనంతరం రంగశాయిపేటకు బదిలీ కాగా ఇద్దరూ వరంగల్‌లో నివాసం ఉంటున్నారు. సుమంత్‌రెడ్డి కాజీపేటలో క్లినిక్ నిర్వహిస్తూ ఉదయం వెళ్లి రాత్రి వచ్చేవాడు. భార్య ఫ్లోరా మరియా సంగారెడ్డిలో పరిచయమైన శామ్యూల్‌తో తరచూ మాట్లాడడంతో పాటు కలుసుకునేవారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉంటున్న సుమంత్‌రెడ్డిని హత్య చేయాలని ఫ్లోరా మరియా, శామ్యూల్‌లు ప్లాన్ చేశారు. శామ్యూల్ తన మిత్రుడైన ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు విషయం చెప్పి సుమంత్‌రెడ్డిని చంపేందుకు సహకరిస్తే సంగారెడ్డిలో ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇవ్వగా అతను అంగీకరించాడు. ఇందు కోసం ఫ్లోరామరియా రూ. లక్షను ఫోన్‌పే ద్వారా శామ్యూల్‌కు పంపగా, అందులో రూ. 50 వేలు రాజ్‌కుమార్‌కు ఇచ్చి మరో రూ. 50 వేలతో హత్య చేసేందుకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశాడు. ఈ నెల 20న రాజ్‌కుమార్, శామ్యూల్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కాజీపేటకు వచ్చారు. పథకం ప్రకారం రెక్కీ నిర్వహించి డాక్టర్ సుమంత్‌రెడ్డి క్లినిక్ ముగించుకుని ఇంటికి వస్తుండగా కారును వెంబడించారు. భట్టుపల్లి రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి రాగానే కారును అడ్డగించి సుత్తితో విచక్షణారహితంగా సుమంత్‌రెడ్డిపై దాడి చేశారు. ఈ దాడిలో డాక్టర్ తీవ్రంగా గాయపడి కింద పడిపోగా చనిపోయాడని భావించి న ఇద్దరు అక్కడ నుంచి వెళ్లిపోయారు. స్థానికుల సహకారంతో సుమంత్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించిన మిల్స్ కాలనీ పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఫ్లోరా మరియా, ప్రియుడు శామ్యూల్, సహకరించిన కానిస్టేబుల్ రాజును అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ వెంకటరత్నం, ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

**ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వైద్యుడు**

వరంగల్ చౌరస్తా : తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న డాక్టర్ సుమంత్‌రెడ్డికి ఎంజీఎం దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో ఆయనను ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చి ఆర్ఐసీయూ న్యూరో విభాగంలో ఉంచి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.



హిమాన్సీ చౌదరికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

### ఆకట్టుకున్న 'సహృదయ' నాటక పోటీలు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 27: హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో విజేతలను నిర్వాహకులు బుధవారం రాత్రి ప్రకటించారు. ప్రముఖ కూచిపూడి నృత్యాచార్య హిమాన్సీ చౌదరికి సహృదయ సంస్థ రంగ స్థల పురస్కారం అందజేశారు. అలాగే, ఉత్తమ ప్రదర్శనగా చిగురు మేఘం నాటికకు ప్రథమ బహుమతి, జనరల్ బోగీలు ద్వితీయ బహుమతి ప్రకటించారు. అలాగే, ఉత్తమ నటుడుగా వెంకట్ గోవాడ, ఉత్తమ గుణ నటిగా బీ నాగరాణి, ఉత్తమ విలన్‌గా ఈ రాధాకృష్ణ, ఉత్తమ హాస్యనటుడిగా ఏపూరి శ్రీనివాస్, ఉత్తమ రచన అవార్డు చలపతి, రచయితగా అగస్త్య, ఉత్తమ దర్శకుడిగా ఖాజావలి, ఉత్తమ సంగీతం డీ రాజశేఖర్ గెలుచుకున్నారు. గిరిజా మనోహర బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుందావఝుల కృష్ణమూర్తి, లక్ష్మణ్‌రావు, రాధాకృష్ణ, డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, నాగరాజు, మల్యాల మనోహర్, కళా రాజేశ్వర్, షఫీ, నాగిళ్ల రామశాస్త్రి, జేఎన్ శర్మ పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలి

*గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే*

వరంగల్, ఫిబ్రవరి 27 : పన్నుల వసూళ్లలో పురోగతి అవసరమని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం ఆమె నగరంలోని ఎల్‌బీ నగర్‌లో పన్నుల వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్ఐ, బిల్ కలెక్టర్లకు రోజు వారీ లక్ష్యాలు నిర్దేశించామన్నారు. కచ్చితంగా ప్రతి రోజూ 100 ఇళ్లల్లో పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. బడా బకాయిదారుల జాబితా సిద్ధం చేసుకొని పన్నుల వసూళ్లు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, రెవెన్యూ అధికారి షహజాదీ బేగం, ఆర్ఐ సోహైల్ పాల్గొన్నారు.

**పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి..**

గ్రేటర్ పరిధిలోని పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని టెలికాం కాలనీలోని పార్కుతో పాటు బల్దియా ఆధ్వర్యంలో క్రిస్టియన్ కాలనీలో నిర్వహిస్తున్న నర్సరీని ఆమె పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించారు. వర్షాకాలంలో పార్కులో నీరు నిలుస్తున్నదని స్థానికులు కమిషనర్‌కు చెప్పగా, వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు పెంచాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, అసిస్టెంట్లు ప్రిన్సీ, అనూహ్య పాల్గొన్నారు.



పన్నుల వసూళ్ల తీరును పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



చెక్‌డ్యామ్ గండిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఇన్‌సెట్‌లో.. చెక్‌డ్యామ్‌కు పడిన గండి

## చెక్‌డ్యామ్‌కు గండి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతుల డిమాండ్
- సాగు నీరు ఇవ్వడం సాధ్యంకాకే రైతుల మధ్య చిచ్చు
- బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుల విమర్శలు
- అధికార పార్టీ నాయకులే బ్లాస్టింగ్ చేసినట్లు చర్చ

చిట్యాల, ఫిబ్రవరి 27 : రైతులకు సాగునీరు అందక నిల్వ ఉన్న నీటి కోసం గుర్తుతెలియని దుండగులు చెక్ డ్యామ్‌కు గండికొట్టిన ఘటన జయశంకర్ భూపాలపల్లి చిట్యాల మండలం నవాబుపేట గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు సాగునీరు అందించేందుకు, భూగర్భ జలాలను కాపాడుకునేందుకు నవాబుపేట శివారులో రూ.10 కోట్లతో చలి వాగుపై చెక్ డ్యామ్‌ను నిర్మించింది. దిగువ భాగాన టేకుమట్ల మండల రైతులకు ఇదే చలి వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ ద్వారా సాగునీరు అందాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు సరిపడా సాగునీరు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఎగువ భాగాన ఉన్న చెక్ డ్యామ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గండి కొట్టి దిగువ భాగాన ఉన్న రైతులకు నీటిని మళ్లిస్తున్నారు. ఆయకట్టు చట్టానికి విరుద్ధంగా గండి కొట్టడంపై ఆయకట్టు ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులే దొంగ చాటున రైతుల మధ్య చిచ్చుపెట్టి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం సిగ్గుచేటని వారు వాపోతున్నారు. టేకుమట్ల మండలానికి చెందిన అధికార పార్టీ ప్రధాన నాయకుడు వారం రోజులుగా మకాం వేస్తూ ట్రాక్టర్ క్రషర్ సహాయంతో చెక్‌డ్యామ్‌ను బ్లాస్టింగ్ చేసినట్లు ఆయకట్టు పరీవాహక రైతులు చర్చించుకుంటున్నారు. అధికారంలో ఉండి సాగునీరు తెప్పించుకోవాలి కానీ మిగతా రైతులను గోసపెట్టడమేంటని ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శిసున్నారు.

*దుండగులను కఠినంగా శిక్షించాలి..*

చెక్‌డ్యామ్ సిమెంట్ కాంక్రీటును గండి కొట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేశ్, మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, మండల యూత్ అధ్యక్షుడు టౌటం నవీన్ డిమాండ్ చేశారు. గండి కొట్టిన చెక్‌డ్యామ్‌ను గురువారం వారు సందర్శించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే బాధ్యత వహించి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

**వెంటనే మరమ్మతులు చేయించాలి..**

**- లక్ష్మీరెడ్డి, రైతు, నవాబుపేట, చిట్యాల, జయశంకర్ జిల్లా**



చెక్‌డ్యామ్‌కు వెంటనే మరమ్మతులు చేయించి నీటిని అదుపు చేయాలి. రైతులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం చొరవ తీసుకొని రెండు పంటల సాగు కోసం చలి వాగులో నీటిని పంపిణీ చేయాలి. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా దిగువ రైతులకు నీరు పంపించేందుకు షెటర్లు ఏర్పాటు చేయాలి. చెక్‌డ్యాముకు గండి కొట్టిన కారకులను కఠినంగా శిక్షించాలి.